cell :98663345657
PMR BUILDING PLANNER
PLAN TODAY BUILD TOMORROW
House Planning | Building Permission | HMDA & DTCP Layout Permission
Estimation | Home Loans | Valuations | Construction Drawings
HOUSE PLANNING BUILDING PERMISSION HMDA & DTCP LAYOUT PERMISSION ESTIMATION HOME LOANS CONSTRUCTION DRAWINGS
Smart Plans... Stronger Structures... Better Tomorrow...


# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190


నేటి దిక్సూచి
తెలుగు దినపత్రిక
రిపోర్టర్స్ కావలెను
నూతనంగా వెలువడుతున్న నేటి దిక్సూచి తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో క్రింద తెలుపబడిన కాటగిరిలలో విలేకరులు కావలెను.
• జిల్లా బ్యూరో లు
• జిల్లా ఇంచార్జి లు
• నియోజకవర్గ రిపోర్టర్లు
• మండల రిపోర్టర్లు
ఆసక్తి గలవారు క్రింది నంబరును సంప్రదించండి
Call : 9100900931

ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :150 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ శనివారం- 26 - సెప్టెంబర్ - 2026

## శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం



శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి సవిత అన్నారు.

కార్ల పరిశ్రమ దగ్గర నుంచి గగన తలంలో ఎగిరే విమానాల పరిశ్రమలు సత్యసాయి జిల్లాకి రావడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమని చెప్పుకొచ్చారు.

శ్రీ సత్యసాయి జిల్లా, సెప్టెంబర్ 25: శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి అన్నారు. కార్ల పరిశ్రమ దగ్గర నుంచి గగన తలంలో ఎగిరే విమానాల పరిశ్రమలు సత్యసాయి జిల్లాకి రావడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమని చెప్పుకొచ్చారు. ఈరోజు(శుక్రవారం)జిల్లాలోని మిగతా..2లో

## తెలంగాణలో ముగిసిన నైరుతి సీజన్ వర్షాలు..రేపటి నుంచి దంచికొట్టనున్న ఎండలు!



తెలంగాణలో వాతావరణం మారిపోనుంది. రాష్ట్రంలో తీవ్ర వాయుగుండం ప్రభావం పూర్తిగా ముగిసిందని,

ఈ సీజన్‌కు సంబంధించి నైరుతి రుతుపవనాల ప్రధాన వర్షాలు దాదాపుగా ముగిసినట్లేనని ప్రముఖ వాతావరణ నిపుణుడు 'తెలంగాణ వెదర్‌మ్యాన్' తన తాజా ట్వీట్‌లో వెల్లడించారు.

సెప్టెంబర్ 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు గణనీయంగా తగ్గిపోయి, పొడి వాతావరణంతో పాటు తీవ్రమైన ఉక్కపోత మొదలవుతుందని స్పష్టం చేశారు. అక్కడక్కడా చెదురుమదురు జల్లులు మినహా చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణమే కొనసాగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 2 వరకు తెలంగాణ అంతటా ఎండల తీవ్రత పెరిగే అవకాశముంది. మిగతా..2లో

## కేసీఆర్ భూములపై విచారణకు ప్రత్యేక కమిటీ - 16 అంశాలతో జాబితా



2

- రాష్ట్రంలో భూ అక్రమాలు గుట్టు విప్పేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.
- దీనిలో 16 అంశాలతో జాబితాను రూపొందించింది.
- మాజీ సీఎం కేసీఆర్ ఇతర నేతల భూముల వివరాలను విచారణాంశాల్లో చేర్చింది.

హైదరాబాద్: భూ అక్రమాలు, ఆక్రమణల గుట్టు విప్పేందుకు శాసనసభ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన మేరకు ప్రభుత్వం ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికోసం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 16 అంశాలపై విచారణ చేయాలని నిర్ణయించింది. మాజీ సీఎం కేసీఆర్ , మాజీ మంత్రులు, కేటీఆర్, హరీశ్ రావులతోపాటు వారి కుటుంబసభ్యులు, ఇంకొందరు బీఆర్ఎస్ నేతలకు సంబంధించి

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

# ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక



హైదరాబాద్: హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. మిగతా..2లో

## ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర..

### మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు



- అర్హులైన ఓటర్లకూ నోటీసులిస్తున్నారని విమర్శ
- గతంలో పలుమార్లు ఓటు వేసిన వారినీ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ
- సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్
- అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలన్న మహేశ్ గౌడ్

హైదరాబాద్: అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పౌరులకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేసినట్టుగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. లేకపోతే వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో మిగతా..2లో

## బీజేపీ సాకులు చెప్పడం ఆపేయాలి 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారు



2

- ఎస్ ఐఆర్ వివాదంపై బీజేపీ సాకులు చెప్పడం ఆపేయాలి: ప్రియాంక గాంధీ

ఢిలి :ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐఆర్ ) ప్రక్రియపై వివాదం చెలరేగిన నేపథ్యంలో, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ శుక్రవారం బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎస్ ఐఆర్ చేపట్టి దేశంలో 13 కోట్ల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ఆమె ఆరోపించారు. తన సోదరుడు రాహుల్ గాంధీ ఇందుకు సంబంధించిన ఆధారాలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచారని అన్నారు. ఈ విషయంపై అధికార బీజేపీ ఇచ్చిన వివరణలను ఆమె తోసిపుచ్చారు. ఈ సమస్యను కేవలం ఒక రాజకీయ ఆరోపణగా కొట్టిపారేయలేమని

## మేక్ ఇన్ ఇండియాతో మార్పు స్పష్టంగా ఉంది' ప్రధాని మోదీ పోస్ట్- కాంగ్రెస్ పార్టీ కౌంటర్

- 2014లో మొదలైన మేక్ ఇన్ ఇండియాకు 12 ఏళ్లు- తయారీ, పెట్టుబడులు, ఎగుమతుల్లో మార్పు కనిపిస్తోందన్న ప్రధాని మోదీ
- ఆశించిన స్థాయిలో ప్రైవేట్ పెట్టుబడులు, ఉద్యోగాల పెరుగుదల లేదన్న కాంగ్రెస్



ఢిల్లి : భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రారంభమైన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా సోషల్ మీడియాలో ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. 12 ఏళ్ల తర్వాత వివిధ రంగాల్లో వచ్చిన మార్పులను ఆయన తన పోస్ట్ లో ప్రస్తావించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ, భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

### 'వివిధ రంగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది'

అయితే 2014 సెప్టెంబర్ 25న ప్రధాని నరేంద్ర మోదీ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిగతా..2లో

## బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు

# నిద్ర పట్టనివ్వడం లేదు

- అంతర్జాతీయ ట్రేడ్ షో నాల్గో ఎడిషన్ కార్యక్రమంలో ప్రసంగించిన అమిత్ షా
- బీజేపీ ప్రభుత్వ హయాంలో యూపీలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని వ్యాఖ్య
- బ్రహ్మోస్ క్షిపణుల ధాటికి పాకిస్థాన్ మోకరిల్లాల్సి వచ్చిందన్న షా



ఢిల్లి: బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు నిద్ర పట్టనివ్వటం లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా బ్రహ్మోస్ క్షిపణుల ధాటికి భారత్ ముందు పాకిస్థాన్ మోకరిల్లాల్సి వచ్చిందన్నారు. శుక్రవారం, అంతర్జాతీయ ట్రేడ్ షో నాల్గో ఎడిషన్‌ను కేంద్ర హోం మంత్రి గ్రేటర్ నొయిడాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో రక్షణ ఉత్పత్తుల తయారీ భారీగా పెరిగిందని మిగతా..2లో

## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు.. 37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం



2

- విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్
- రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న నాదెండ్ల
- ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడి

అమరావతి :ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ

## అహ్మదాబాద్ లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట

# వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు

- గుజరాత్‌లోని అహ్మదాబాద్ లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట కొనసాగిస్తున్నారు.
- పెట్టుబడుల అవకాశాలపై ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇవ్వడంతో
- అహ్మదాబాద్ వేదికగా పారిశ్రామిక భాగస్వామ్యాలకు కొత్త బాట పడింది.
- గుజరాత్‌లోని అహ్మదాబాద్ లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట



అమరావతి: : గుజరాత్‌లోని అహ్మదాబాద్ లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. క్లీన్ ఎనర్జీ నుంచి ఫార్మా, ఇండస్ట్రియల్ పార్కులు, ఎడిబుల్ ఆయిల్స్, టైర్ల తయారీ వరకు ఏపీని కొత్త పెట్టుబడుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మంత్రి లోకేశ్ ప్రతిపాదించారు. టోరెంట్, వెల్స్‌పన్, గోకుల్ ఆగ్రోస్, చిరిపాల్ గ్రూపులతో జరిగిన వరుస భేటీల్లో భారీ విస్తరణలకు రాష్ట్రాన్ని ఎంచుకోవాలని ఆహ్వానించారు. పెట్టుబడుల అవకాశాలపై ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇవ్వడంతో అహ్మదాబాద్ వేదికగా పారిశ్రామిక భాగస్వామ్యాలకు కొత్త బాట పడింది. అహ్మదాబాద్ పర్యటనలో భాగంగా మంత్రి నారా లోకేశ్ వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహిస్తూ సుడిగాలి పర్యటన చేపట్టారు. టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, డైరెక్టర్లు షాన్ మెహతా, జిగీష్ మెహతాలతో జరిగిన చర్చల్లో ఫార్మా రంగంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వైజాగ్ ప్లాంట్ బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్‌లో భాగంగా ఏపీఐలు, అధునాతన ఇంటర్మీడియట్ల తయారీ సామర్థ్యాలను విస్తరించే

## ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- తీవ్ర వాయుగుండం వల్ల రాష్ట్రంలో పంట నష్టంపై తక్షణ అంచనాకు ఆదేశం
- పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచన
- ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్
- పొలాల్లోని నీటిని తొలగిస్తూనే, భవిష్యత్తు కోసం నిల్వ చేయాలని దిశానిర్దేశం



2 లో

- రైతులకు సాంకేతిక సలహాలు అందించి అండగా నిలవాలని స్పష్టం

అమరావతి : తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్లు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేసినట్లు ఆయన వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు మిగతా..2లో

# అహ్మదాబాద్ లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు

మొదటి పేజి తరువాయి

ప్రాజెక్టులకు కూడా ఏపీ అవకాశాలను వివరించారు. ఎనర్జీ స్టోరేజ్, గ్రీన్ మాలిక్యూల్స్ రంగాల్లో టోరెంట్ పవర్ విస్తరణ ప్రణాళికలకు అనుగుణంగా పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను రాష్ట్రంలో చేపట్టాలని సూచించారు. కంపెనీ విస్తరణ ప్రణాళికలను సమీర్ మెహతా లోకేశ్ కు వివరించారు. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని చేరుకోవడమే లక్ష్యమని ఏపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని చైర్మన్ సమీర్ మెహతా వెల్లడించారు. కాకినాడలో బహుముఖ పారిశ్రామిక పార్కు : వెల్స్పన్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో చర్చల్లో కాకినాడలో బహుముఖ పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు లోకేశ్ ప్రతిపాదన పెట్టారు. టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, డీఐ పైపుల తయారీ, పైపు కోటింగ్, గ్రీన్ అమోనియా యూనిట్లను ఒకే వేదికపై ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా ఆహ్వానించారు. గత ఏడాది దావోస్‌లో చంద్రబాబుతో జరిగిన చర్చల్లో వచ్చిన ప్రతిపాదనల పురోగతిని ఇరువురు సమీక్షించారు. వెల్స్పన్ గ్రూప్ ఇప్పటికే రాష్ట్రంలో చేపట్టిన కార్యకలాపాలను నితిన్ జైన్ వివరించారు. కర్నూలు, కడప జిల్లాల్లో



100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును సంస్థ నిర్వహిస్తోందన్నారు. కాకినాడశ్రీకాకుళం గ్యాస్ పైప్‌లైన్ కోసం ఏపీజీడీసీకి, రిలయన్స్ కేజీ-డీ6 ప్రాజెక్టుకు పైపులను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు. విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ యూనిట్ : గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కనుభాయ్ జె.ఠక్కర్‌తో భేటీలో నెల్లూరులోని ప్రస్తుత ప్లాంట్ విస్తరణకు ప్రతిపాదన వచ్చింది. పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీలను ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. కృష్ణపట్నంలో రోజుకు 1,400 టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన వంటనూనె రిఫైనరీ 2024 నుంచి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తోందని కనుభాయ్ ఠక్కర్ తెలిపారు. కాండ్ల, కృష్ణపట్నం, హల్దియా, మంగుళూరులో సంస్థకు ప్లాంట్లు ఉన్నాయని దక్షిణాది మార్కెట్ల కోసం మరింత విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. చిరిపాల్ గ్రూప్ ఎండీ బ్రిజ్ మోహన్ చిరిపాల్, గ్రూ సోలార్ సీఈఓ వినయ్ థదానితో జరిగిన సమావేశంలో విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ యూనిట్‌పై చర్చించారు. మౌలిక వసతులు, రోడ్డు కనెక్టివిటీ, విధానపరమైన మద్దతు వంటి అంశాలను లోకేశ్ వివరించారు. విశాఖలో పారిశ్రామిక ప్రాజెక్టులకు ఉన్న అనుకూలతలను తెలియజేస్తూ పెట్టుబడికి ఆహ్వానించారు. టైర్ల తయారీ యూనిట్‌పై ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని బ్రిజ్ మోహన్ చిరిపాల్ తెలిపారు. 52 దేశాలకుపైగా ఉత్పత్తులు : చిరిపాల్ గ్రూప్ కార్యకలాపాల విస్తృతిని బ్రిజ్ మోహన్ వివరించారు. నందన్ డెనిమ్, విశాల్ ఫ్యాబ్రిక్స్, నందన్ టెర్రీ వంటి వస్త్ర ఉత్పత్తులతో పాటు చిరిపాల్ పాలీఫిల్మ్స్, గ్రూ సోలార్, రసాయన ఉత్పత్తులను సంస్థ ఎగుమతి చేస్తోందన్నారు. 52కుపైగా దేశాలకు తమ ఉత్పత్తులు చేరుతున్నాయని తెలిపారు. తెలంగాణ, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, జమ్మూ-కశ్మీర్‌లో ఇప్పటికే తయారీ యూనిట్లు ఉన్నాయని వెల్లడించారు.

# కేసీఆర్ భూములపై విచారణకు ప్రత్యేక కమిటీ - 16 అంశాలతో జాబితా

మొదటి పేజి తరువాయి

ఆయా గ్రామాల్లోని భూముల వివరాలను విచారణ అంశాల్లో చేర్చింది. వీరి ఆధీనంలోని భూముల్లో ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయి. వీటితో పాటు ఎసైన్డ్ , ఇతర భూముల అక్రమణలు, కొనుగోళ్లు జరిగాయన్న ఆరోపణల నిగ్గు తేల్చాలని విచారణ కమిటీకి నిర్దేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీచేశారు.

### సంబంధిత జిల్లాల్లో క్షేత్రస్థాయి విచారణ

సంబంధిత జీవోను బుధవారం జారీ చేసినప్పటికీ ఇది గురువారం వెలుగులోకి వచ్చింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేనను కమిటీ చైర్ పర్సన్ గా నియమించారు. స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతోపాటు ఆయా భూములున్న జిల్లాలకు చెందిన కలెక్టర్ లు సభ్యులుగా ఉంటారు. తుది నివేదిక ఇచ్చేలోగా అంశాల తీవ్రతను అనుసరించి మధ్యంతర నివేదికలను సమర్పించాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. రంగారెడ్డి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, హైదారాబాద్ జిల్లాల్లో క్షేత్రస్థాయి విచారణను ఈ కమిటీ చేపట్టనుంది.

### విచారణ అంశాలు ఇవే

మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఆయన కుటుంబ సభ్యులు, భాగస్వాములకు సంబంధించి సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని ఎర్రవల్లి, మర్కూక్ , శివారు వెంకటాపూర్ లోని భూములు. మాజీ మంత్రి హరీశ్ రావు, అతని కుటుంబ సభ్యులు, ఇతర భాగస్వాములకు సంబంధించి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలోని రంగనాయకసాగర్ జలాశయానికి సంబంధించిన భూములు, ఇతర అంశాలు, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్ నగర్ గ్రామ పరిధిలోని భూములు. ఎం.హనుమంతరావు, 271 సర్వే నంబరులో కొనుగోలు చేసిన ఎసైన్డ్ భూములు - సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం వెలికట్ట గ్రామం. మల్లన్నసాగర్ నిర్మాణంలో భాగంగా సిద్దిపేట జిల్లాలో చేపట్టిన భూ సేకరణలో రోపణలపై మాజీ ఎమ్మెల్యే ఎస్.రామలింగారెడ్డి ఇచ్చిన పిర్యాదుతో విచారించనున్నారు. తొగుట మండలంలోని పల్లెపహాడ్ , తుక్కాపూర్ , ఏటిగడ్డ కిష్టాపూర్ , రాంపూర్ భూ సేకరణ జరిగిన ప్రాంతాల్లో విచారణ. మాజీ మంత్రి కేటీఆర్ , అతని కుటుంబసభ్యులు, భాగస్వాములు, శతభిష అగ్రో, ఇతర సంస్థలు, ఆయన వ్యక్తిగతంగా కొనుగోలు చేసిన రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం, జన్వాడ ప్రాంతాల్లో భూములు. మాజీ మంత్రి జి. జగదీశ్వర్ రెడ్డి, కుటుంబసభ్యులు, భాగస్వాములు - రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూరు. మాజీ ఎమ్మెల్యే పీ.రోహిత్ రెడ్డి, ఎసైన్డ్ భూముల కొనుగోళ్లు, అక్రమణలు - రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం, అజీజ్ నగర్ గ్రామం. మాజీ మంత్రి గంగుల కమలాకర్ - ఇతరలు, ప్రభుత్వ భూముల అక్రమ కొనుగోలు, ఆక్రమణలకు సంబంధించిన ఆరోపణలు - రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం బహదూర్ గూడ. ఇదే జిల్లా గండిపేట మండలం వట్టినాగుల పల్లిలోని శంకర హిల్స్ లో అక్రమ కొనుగోళ్ల ఆరోపణలపైనా. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఇతరులకు సంబంధించి భూదాన్ భూములు అక్రమ కొనుగోళ్ల ఆరోపణలు - రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం,



వట్టినాగులపల్లి. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్ లో జరిగిన భూదాన్ భూముల కొనుగోళ్లు. మాజీ ఎమ్మెల్సీ ఎల్విన్ స్టీఫెన్ సన్ , లీజు భూముల క్రమబద్ధీకరణ - హైదరాబాద్ జిల్లా సికింద్రాబాద్ మండలం జీరా భూములు. ధరణి పోర్టల్ మాధ్యూల్ల దుర్వినియోగంపై రాజ్ హైటెక్ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ , రాజ్ పౌల్ట్రీ,ప్లాంటేషన్ , అగ్రికల్చర్ ఫామ్స్ , మనవిహా బ్రీడర్స్ ఎల్ ఎల్ పీ. (ఎం.హనుమంతరావు, ఎం.సుమన్ , టీ.మహేశ్ రావు, భాగస్వాములు) - మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండలం గండీడ్ . ప్రభుత్వ భూములు, ఎసైన్డ్ భూముల కొనుగోళ్లు తదితర అంశాలకు సంబంధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి, సిరిసిల్ల తదితర మండలాల్లోని సర్దార్ పూర్, లక్ష్మీపూర్ , తంగళ్లపల్లి గ్రామాల్లో విచారణ నిర్వహించనున్నారు. మధ్య మానేరు జలాశయం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో అక్రమంగా పరిహారం పొందారన్న ఆరోపణలపై జోగినపల్లి రవీందర్ రావు. జె, సౌమ్యలకు సంబంధించి - రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి, ఇతర మండలాలు, జలాశయం భూ సేకరణ చేపట్టిన మన్వాడ తదితర గ్రామాల్లో విచారణ చేయనున్నారు.

# బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు నిద్ర పట్టనివ్వడం లేదు: అమిత్ షా

మొదటి పేజి తరువాయి

అమిత్ షా చెప్పారు. 80దేశాలకు మన రక్షణ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నట్లు తెలిపారు. అమేఠీలో తయారైన ఏకే-203 అసాల్ట్ రైఫిల్స్ ఉగ్రవాదుల భరతం పడుతున్నాయని అన్నారు. “దేశవ్యాప్తంగా రక్షణ ఉత్పత్తుల అభివృద్ధి జరిగింది. మన రక్షణ ఉత్పత్తి రూ.1,78,000 కోట్లను దాటింది. 2013-14తో పోలిస్తే రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లో 56రెట్లు వృద్ధి సాధించాం. 80 దేశాలకు దేశ రక్షణ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. యూపీలో తయారైన బ్రహ్మోస్ పాకిస్థాన్ నిద్రను దూరం చేస్తోంది. ఇది మార్పుకు అతిపెద్ద సంకేతం. అమేఠీలో తయారైన ఏకే-203 అసాల్ట్ రైఫిల్ మావోయిస్టులు, ఉగ్రవాదులకు నిద్రను దూరం చేసింది.“ -అమిత్ షా,కేంద్ర హోంశాఖ మంత్రి

### మోదీ విధానాల వల్లే ఈ మార్పు!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో ఉన్న రాజకీయ స్థిరత్వాన్ని అమిత్ షా కొనియాడారు. వరుసగా మూడు పర్యాయాలు ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న మోదీ, విధానాలను రూపొందించడమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో అమలు అయ్యేలా చూశారని చెప్పారు. అందువల్లే భారత్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, భారత్ తన వృద్ధి రేటును నిలబెట్టుకోవడమే కాకుండా దానిని మరింత వేగవంతం చేసిందని షా అన్నారు. 2047ఆగస్టు 15 నాటికి భారత్ అన్ని రంగాల్లో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందన్న మోదీ సంకల్పం నిజమౌతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

### ‘యోగి ప్రభుత్వ హయాంలో మాఫియాను తుదిముట్టించాం‘

ఉత్తర్ ప్రదేశ్ లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మాఫియాపై ఉక్కుపాదం మోపిందని అమిత్ షా ఉద్ఘాటించారు. మాఫియా శక్తులను తుడిచిపెట్టడానికి ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని నొక్కి చెప్పారు. ఆపై, రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. 2017లో బీజేపీ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ఆయన గుర్తు చేసుకున్నారు. “2013లో ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడానికి ఒక సదస్సును నిర్వహించింది. అయితే, లఖ్ నవూలోని శాంతిభద్రతల పరిస్థితి కారణంగా ఆ కార్యక్రమాన్ని దిల్లీలో నిర్వహించాల్సి వచ్చింది. ఎందుకంటే, లఖ్ నవూలో నెలకొన్న భయాందోళన పరిస్థితుల కారణంగా ఏ పెట్టుబడి దారుడు అక్కడికి రావడానికి సిద్ధంగా లేరని అప్పటి యూపీ అధికారులే స్వయంగా మీడియాతో చెప్పారు. అయితే, అప్పటి పరిస్థితులను ప్రస్తుత పరిస్థితులతో పోల్చి చూస్తే ఎంతో మార్పు ఉంది. ప్రస్తుతం రాష్ట్రం భయ రహితంగా, పెట్టుబడులకు కేంద్రంగా, జాతీయ వృద్ధికి చోదక శక్తిగా మారిందని, ఆ ఘనత డబుల్ ఇంజిన్ సర్కార్‌దే. ఈ సానుకూల మార్పు వల్లే యూపీ ఇప్పుడు 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకోగలిగింది.“

- అమిత్ షా, కేంద్ర హోంమంత్రి ఒకప్పుడు ఉత్తర్‌ప్రదేశ్‌ను పాలించిన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీల పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అమిత్ షా ఎత్తి చూపారు. “ఒకప్పుడు ఇక్కడ ఎస్పీ, బీఎస్పీ పాలనలో ఒక ‘క్రైమ్ ఇండస్ట్రీ‘ వర్ధిల్లేది. కానీ, 10 సంవత్సరాల తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వారి హయాంలో నెలకొన్న గూండాయిజాన్ని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా తుడిచిపెట్టింది. అక్రమ పిస్టల్ తయారైన స్థానంలో, డిఫెన్స్ కారిడార్‌ను ఏర్పాటు చేశారు. వాహనాల చోరీ జరిగిన ప్రాంతంలో వాహన తయారీ వచ్చింది. అలాగే, చైన్ స్నాచింగ్ జరిగిన చోట మెడికల్ డివైజ్ పార్కు వస్తోంది“ అని అమిత్ షా పేర్కొన్నారు.

# మేక్ ఇన్ ఇండియాతో మార్పు స్పష్టంగా ఉంది‘- ప్రధాని మోదీ పోస్ట్- కాంగ్రెస్ పార్టీ కౌంటర్

మొదటి పేజి తరువాయి

పెట్టుబడులను ఆకర్షించడం, తయారీని పెంచడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మౌలిక వసతులను బలోపేతం చేయడం ఆ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు. “భారత్‌లో మరింత తయారీ. భారత్‌లో మరింత పెట్టుబడి. భారత్ నుంచి మరింత ఎగుమతులు. వివిధ రంగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది“ అని మోదీ పోస్టులో చెప్పారు. దేశం అభివృద్ధి చెందేందుకు అవసరమైన మౌలిక వసతులు, వ్యాపార అవకాశాలు, ఆవిష్కరణలను మేక్ ఇన్ ఇండియా ప్రోత్సహిస్తోందని చెప్పారు.

కాంగ్రెస్ ఏమంటోంది?

అయితే మేక్ ఇన్ ఇండియా విజయాలపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, ఆ కార్యక్రమం ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదని విమర్శించారు. తయారీ రంగంలో వృద్ధి మొత్తం ఆర్థిక వ్యవస్థ వృద్ధితో పోలిస్తే చాలా సందర్భాల్లో తక్కువగానే ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ పెట్టుబడుల భారీ పెరుగుదల కనిపించలేదని, విస్తృత స్థాయిలో ఉద్యోగాల కల్పన కూడా జరగలేదని కాంగ్రెస్ ఆరోపించింది. తయారీ రంగం గణాంకాలను పరిశీలిస్తే మేక్ ఇన్ ఇండియా వల్ల ప్రత్యేకంగా కనిపించే అదనపు వృద్ధి ఇంకా స్పష్టంగా కనిపించడం లేదని జైరాం రమేశ్ ఎక్స్ లో పోస్ట్ చేశారు.

12 ఏళ్లలో ఏం మారింది?

ప్రభుత్వం ప్రకారం, మేక్ ఇన్ ఇండియా కేవలం దేశీయ అవసరాల కోసం వస్తువులు తయారు చేయడానికే పరిమితం కాలేదు. అంతర్జాతీయ మార్కెట్ల కోసం కూడా ఉత్పత్తులు తయారు చేసే స్థాయికి భారత్ ఎదుగుతోందని కేంద్రం చెబుతోంది. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఫార్మా, స్టీల్, రైల్వేలు, రక్షణ రంగాల్లో ఉత్పత్తి సామర్థ్యం పెరిగిందని పేర్కొంది. ప్రస్తుతం మేక్ ఇన్ ఇండియా 2.0 కింద తయారీతో పాటు సేవల రంగాలను కలిపి మొత్తం 27 రంగాలపై దృష్టి పెట్టారు. ఆ ప్రయాణంలో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకాలు కీలకంగా మారాయని ప్రభుత్వం చెబుతోంది. 14 కీలక రంగాల్లో అమలవుతున్న ఆ పథకాల కింద 2026 మార్చి నాటికి రూ.2.40 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. రూ.22.66 లక్షల కోట్లకు పైగా ఉత్పత్తి, అమ్మకాలు నమోదయ్యాయి. రూ.15.20 లక్షల కోట్లకు పైగా ఎగుమతులు జరిగాయి. ప్రత్యక్ష, పరోక్షంగా 14.15 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి.

మొబైల్ మేకింగ్‌లో భారీ మార్పు

మేక్ ఇన్ ఇండియా ప్రభావాన్ని ఎలక్ట్రానిక్స్ రంగంలో స్పష్టంగా చూడొచ్చని కేంద్రం చెబుతోంది. 2014-15లో దేశంలో ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఉత్పత్తి విలువ సుమారు రూ.1.9 లక్షల కోట్లు ఉండగా, 2025-26లో అది రూ.13.11 లక్షల కోట్లకు చేరింది. అంటే దాదాపు ఏడు రెట్లు పెరిగింది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు కూడా రూ.38 వేల కోట్ల నుంచి రూ.4.24 లక్షల కోట్లకు పెరిగాయి. మొబైల్ ఫోన్ల తయారీలోనూ ఇదే స్థాయిలో మార్పు కనిపించింది. 2014-15లో సుమారు రూ.18 వేల కోట్ల విలువైన మొబైల్ ఫోన్లు తయారయ్యాయి. 2025-26 నాటికి ఆ విలువ రూ.6.27 లక్షల కోట్లకు చేరింది. మొబైల్ ఫోన్ ఎగుమతులు కూడా సుమారు రూ.1,500 కోట్ల నుంచి రూ.2.59 లక్షల కోట్లకు పెరిగాయి. ప్రస్తుతం భారత్‌లో ఉపయోగించే మొబైల్ ఫోన్లలో 99.2 శాతం దేశంలోనే తయారవుతున్నాయని ప్రభుత్వం తెలిపింది.

ఎగుమతులపై ఫోకస్

మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశంలో తయారీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో భారత్ భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్రం చెబుతోంది. సెమీకండక్టర్లు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ భాగాలు, సోలార్ పరికరాలు, ఫార్మా, ఆటో రంగాల్లో ప్రత్యేక పథకాలను తీసుకొచ్చింది. సెమీకండక్టర్ రంగంలోనూ భారీ పెట్టుబడులను ఆకర్షించే చర్యలు కొనసాగుతున్నాయి. వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ కూడా మేక్ ఇన్ ఇండియాపై స్పందించారు. భారత్ ఒకప్పుడు ప్రధానంగా దేశీయ మార్కెట్ అవసరాల కోసం తయారీ చేయాలనే లక్ష్యంతో ఉండేదని, ఇప్పుడు ప్రపంచ మార్కెట్ల కోసం తయారు చేసే సామర్థ్యాన్ని పెంచుకుంటోందని అన్నారు.

# బీజేపీ సాకులు చెప్పడం ఆపేయాలి- 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారు

మొదటి పేజి తరువాయి

అన్నారు. “క్షమించండి. ఇది చాలా పాతబడిన, బలహీనమైన వాదన. ఎస్ ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న దానికి ఆధారాలు ఉన్నాయి. నా సోదరుడు చాలా విలేకరుల సమావేశాల్లో వాటిని చూపించారు. ప్రజల ముందు ఆ ఆధారాలను ఉంచారు. ఇప్పుడు ఆ విషయం స్పష్టమైంది. దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారు. దీనిపై బీజేపీ కుంటిసాకులు చెప్పడం మానేయాలి“ అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.

అది తీవ్రమైన నేరం!

“ఎన్నికల ప్రక్రియలో ఏ రకమైన జోక్యం చేసుకున్నా, అది ప్రజాస్వామ్యపరంగా, రాజ్యాంగపరంగా తీవ్రమైన నేరం అవుతుంది. వారు (బీజేపీ) మన ఎన్నికల్లో జోక్యం చేసుకుంటుంటే, వారి నాయకత్వం ఎన్నికల సంఘం చేత ఇలా చేయిస్తుంటే, అది దేశద్రోహ చర్య అవుతుంది. వారు ఈ విషయాన్ని గ్రహించాలి. అలాగే వారు ఆ బాధ్యతను తీసుకోవాలి. ఒకవేళ వారు ఎలా చేయకపోతే ఎందుకు బహిరంగంగా చెప్పలేకపోతున్నారు. దేనికి వాళ్లు భయపడుతున్నారు?“ అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. అంతేకాదు ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే పద్ధతి చాలా కాలంగా కొనసాగుతోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. “వారు ఎన్నికలను రిగ్గింగ్ చేయడం మొదలు పెట్టిన ఎన్ని ఏళ్లు అయ్యింది?“ అని నిలదీశారు. ఎస్ ఐఆర్ , ఎన్నికల సంఘం పనితీరుపై రాజకీయ ఘర్షణలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఆమె ఈ ఘాటు విమర్శలు చేయడం గమనార్హం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలకు డిమాండ్ కాగా, ఎస్ ఐఆర్ వివాదం నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా ప్రక్రియలో చట్టవిరుద్ధమైన చర్యలు జరిగినట్లు రుజువైతే, అందుకు బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మరోవైపు సీఈసీపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు విపక్ష పార్టీలు కూడా సంకేతాలు ఇస్తున్నాయి. ఇదే విషయాన్ని ప్రియాంక గాంధీని అడగగా, దీనిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో చర్చించి, ఏం చేయాలో నిర్ణయిస్తామని ఆమె పేర్కొన్నారు.

వారు దేశద్రోహులు

మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ లపై తీవ్ర విమర్శలు చేశారు. “సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దేశానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆయనను ఎంపిక చేశారు. జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగంపై దాడులు చేస్తున్నప్పటికీ, అతనిని మోదీ, షా కాపాడుతున్నారు. 2024 ఎన్నికలకు ముందు సీఈసీపై చట్ట ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఓ చట్టం తెచ్చారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయి. ఈ క్రమంలో ఓటు చోరీ చివరకు, చట్టం చోరీగా మారుతోంది“ అని రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు.

అంతా చట్టపరంగానే జరుగుతోంది!

తమపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల

మొదటి పేజి తరువాయి

# ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

తలెత్తకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులతో శుక్రవారం ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బూడితి రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో పాటు పార్వతీపురం మన్యం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టంపై వెంటనే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించి, వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించి, వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా దెబ్బతిన్న ముఖ్యమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను సమీక్షించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. పంటలకు హాని కలిగించే చోట నీటిని తొలగిస్తూనే, చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటిని నిల్వ చేసి భవిష్యత్తు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు నిరంతర సహాయం అందించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు.. 37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడిన ఆయన, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియకు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సేకరణ ప్రక్రియ కోసం 24 వేల మంది సిబ్బందిని నియమించగా, కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించారు. ఈసారి రైతులకు రవాణా ఖర్చులు కూడా చెల్లించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా పంట దిగుబడులు, తద్వారా ధాన్యం సేకరణ అంచనాలు తగ్గినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా సకాలంలో కొనుగోలు చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లుల సామర్థ్యం, చెల్లింపుల ప్రక్రియ వంటి అంశాల్లో పౌరసరఫరాల శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు.

# శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం

కొత్తచెరువులో నూతన జడ్పీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చొరవతోనే జిల్లాకు పరిశ్రమలు వెల్లువెత్తున్నాయన్నారు. సత్యసాయి జిల్లాకు తాగునీరు, సాగునీరు అందించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు, సీఎం చంద్రబాబు దే అని మంత్రి సవిత కొనియాడారు. శ్రీ సత్యసాయి జిల్లా జడ్పీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జడ్పీటీసీ స్థానాలను గెలుస్తామన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ విజయమే లక్ష్యమని చెప్పుకొచ్చారు. టీడీపీ శ్రేణులు సమష్టిగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు.

# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి... ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

# ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర.. మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు

పుట్టిన పౌరులకు, గతంలో పలుమార్లు ఓటు వేసిన వారికి కూడా నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని అన్నారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జనం అతిపెద్ద పండుగల్లో ఒకటని మహేశ్ కుమార్ చెప్పారు. గణనాథుడిని సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందాలని ఆకాంక్షించారు. మరోసారి ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్‌కు ఉండాలని కోరుకున్నామని చెప్పారు.

# తెలంగాణలో ముగిసిన నైరుతి సీజన్ వర్షాలు.. రేపటి నుంచి దంచికొట్టనున్న ఎండలు!

ఈ రోజుల్లో రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 36 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నివేదిక హెచ్చరించింది. అక్టోబర్ మొదటి వారంలో మళ్లీ కాస్త ఉపశమనం లభించవచ్చని తెలిపారు. ఈశాన్య రుతుపవనాలకు ముందు వీచే తూర్పు గాలుల ప్రభావం వల్ల అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ మధ్య దక్షిణ తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్‌మ్యాన్ అంచనా వేశారు. అయితే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మాత్రం ఈ ఏడాదికి ప్రధాన రుతుపవన వర్షాల కాలం సెప్టెంబర్ 26తో ముగిసినట్లేనని, ఆ ప్రాంతాల్లో ఇకపై సాధారణ పొడి వాతావరణమే ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు.

# ఐరాస పట్ల వారికి నిజమైన శ్రద్ధలేదు కేవలం దానిని వాడుకుంటున్నారు: జైశంకర్

**ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు వ్యతిరేకించే వారికి దాని పట్ల నిజమైన శ్రద్ధలేదు**

**కేవలం వారు దానిని వాడుకుంటున్నారు- భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు**

ఢిల్లీ: ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు చేయకపోవడం వల్ల అంతర్జాతీయ సమాజంలో అసహనం పెరుగుతోందని భారత విదేశాంగ మంత్రి ఎస్ . జైశంకర్ అన్నారు. సంస్కరణలను వ్యతిరేకించేవారు ఐరాసను కేవలం వాడుకుంటున్నారని, దాని పట్ల వారికి ఏమాత్రం శ్రద్ధలేదని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. న్యూయార్క్ లో ఏటా జరిగే ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశం చర్చకు వస్తుందని, అయితే ప్రస్తుతం ఆ డిమాండ్ మరింత బలపడుతోందని ఆయన స్పష్టం చేశారు. ఐరాస సాధారణ సభ 81వ సమావేశాల సందర్భంగా అబర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ , రిలయన్స్ ఫౌండేషన్ , భారత్ లోని యూఎన్ కార్యాలయం, ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి బృందం- సంయుక్తంగా ఓ మంత్రుల స్థాయి సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశంలో పాల్గొన్న జైశంకర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. “ఐరాస సంస్కరణల విషయంలో మనం నిజాయితీగా ఉంటే, కచ్చితంగా ఒక నిర్దిష్ట ముసాయిదా (టెక్ట్స్) ఆధారంగా చర్చలు జరపాలి. అలా చేయకపోతే అది చర్చ అనిపించుకోదు. కేవలం కాలపాయన మాత్రమే అవుతుంది. వాస్తవానికి నేటి యూఎన్ చాలా భిన్నంగా ఉండాలి. వాస్తవ ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా మరింత మారాలి. అంతర్జాతీయ సమాజం ఈ సంస్కరణలనే కోరుతోంది. ఇది ఐక్యరాజ్యసమితికి వ్యతిరేకించడం కాదు. నిజానికి దాని పట్ల శ్రద్ధ ఉన్న వారే దానిని సంస్కరించాలని కోరుకుంటారు. సంస్కరణలను వ్యతిరేకించేవారికి ఐరాస పట్ల నిజమైన శ్రద్ధలేదు. వారు దానిని కేవలం వాడుకుంటున్నారు“ అని జైశంకర్ పేర్కొన్నారు.

అలా అయితే సంస్కరణలు చేయలేం!

ప్రస్తుత పరిస్థితుల్లో అందరి ఏకాభిప్రాయంతో ఐరాసలో సంస్కరణలు చేయడం సాధ్యం కాదని జైశంకర్ తేల్చిచెప్పారు. “ప్రజాస్వామ్యంలో మనం ఓటింగ్ జరిపి, మెజారిటీ ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటాం. ఎందుకంటే భిన్నమైన అభిప్రాయాలు ఉన్నవారు ఉంటారు. ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలు వెల్లడించే హక్కు ఉండాలి. ఆ తర్వాత ఓటింగ్ ద్వారా నిర్ణయం తీసుకోవాలి. అలాగే ఐరాసలో సంస్కరణల కోసం ఒక ముసాయిదా తప్పనిసరిగా ఉండాలి. దానిపై అందరి అభిప్రాయాలు సేకరించాలి. తద్వారా ప్రజాస్వామ్యబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనాలి“ అని ఆయన స్పష్టం చేశారు.

పరస్పర సహకారం పెరుగుతోంది!

ప్రస్తుతం గ్లోబల్ సౌత్ దేశాల మధ్య పరస్పర సహకారం, పంచుకునే ధోరణి గణనీయంగా పెరిగిందని జైశంకర్ పేర్కొన్నారు. “ప్రస్తుతం చాలా దేశాలు ఒకదానితో ఒకటి మాట్లాడడానికి, కలిసి మరిన్ని పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇది చాలా మంచి పరిణామం. ఎందుకంటే ఇది పాతకాలపు పరస్పర ఆధారిత సంబంధాలను తొలగిస్తుంది. ప్రపంచం మరింత ప్రజాస్వామ్యయుతంగా మారుతుంది“ అని జైశంకర్ అన్నారు.

ఐరాస సెక్రటరీ జనరల్ గా ఓ మహిళ?

తదుపరి ఐరాస సెక్రటరీ జనరల్ ఎంపిక విషయం గురించి కూడా జైశంకర్ మాట్లాడారు. ఓ మహిళను యూఎన్ సెక్రటరీ జనరల్ గా నియమించాలనే ఆలోచన కింది స్థాయి నుంచి వచ్చిందని, ఇది పై స్థాయి నుంచి రుద్ధబడలేదని ఆయన స్పష్టం చేశారు. , ఐరాస సాధారణ సభలో జరిగిన ఉన్నత స్థాయి చర్చల సందర్భంగా ప్రపంచ నాయకులు ఓ పిలుపునిచ్చారు.

# గుండి రోడ్డు గుంతలమయం

## పట్టించుకోని అధికారులు, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 25: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బైపాస్ గుండి రోడ్డు ఏళ్లుగా గుంతలమయంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. డీబీఎల్ కంపెనీ బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసినా, పక్కనే ఉన్న 600 మీటర్ల రోడ్డును మాత్రం పూర్తి చేయకుండా వదిలేసింది. దీనిపై గతంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా, డీబీఎల్ కంపెనీ ప్రతినిధులు రోడ్డు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఇప్పటివరకు పనులు జరగలేదు. ఈ రోడ్డు గుండా జిల్లా కేంద్రానికి ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా పరిస్థితిని పట్టించుకోవడం లేదు. గుంతల కారణంగా వాహనదారులు పడిపోయి గాయాలపాలై ఆస్పత్రి పాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న ఈ రోడ్డునే పూర్తి చేయని అధికారులు, గ్రామాల్లోని రోడ్లను ఎలా పూర్తి చేస్తారని డివైఎఫ్ఐ ప్రశ్నించింది. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, సర్పంచ్ స్పందించి గుంతలతో నిండిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని, లేనిపక్షంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌడిసెల కార్తీక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కోశాధికారి దుర్గం నిఖిల్, స్థానికులు పవన్, శ్రీకాంత్, కళ్యాణ్, శశికాంత్, సాగర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి

### ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలి

### డీడీ జాదవ్ అంబాజీ




కొమరం భీమ్, సెప్టెంబర్ 25.. : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం తీర్యాని మండలం గిన్నెదరి స్కూల్ కాంప్లెక్స్‌లో రొంపల్లి, దంతన్‌పల్లి, గిన్నెదరి పాఠశాలల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాఠశాలల పనితీరును సమీక్షించారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు బలమైన పునాది ఏర్పడేలా ఎఫ్‌ఎల్‌ఎన్ విద్యా విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని, చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, బోధనా ప్రణాళికలు, విద్యార్థుల అభ్యసన ఫలితాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాంలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు తదితర సామగ్రి విద్యార్థులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాథమిక విద్యే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అని, ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో పనిచేయాలని డీడీ పేర్కొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన గిన్నెదరి ఆశ్రమ పాఠశాల బాలికల ప్రధానోపాధ్యాయుడు నైతం కృష్ణరావును తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం (టి ఎస్ టి డబ్ల్యు టి యు) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ గోడం చందన్, ఏసీఎంఓ పూర్కా ఉద్దవ్, ఏటీడీఓ చిరంజీవి, జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు, జీసీడీఓ కొట్నాక్ శకుంతల, ప్రధానోపాధ్యాయులు నైతం కృష్ణరావు, మాడావి గోపాల్, కొట్నాక్ యాదవరావు, ఎస్సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల హక్కులు ఎంప్లాయీస్ యూనియన్‌తోనే సాధ్యం



రెబ్బెన సెప్టెంబర్ 25 : ఆర్టీసీ విలీనం, కార్మికుల హక్కుల సాధన ఎంప్లాయీస్ యూనియన్‌తోనే సాధ్యమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రత, పీఆర్సీ, సీసీఎస్ బకాయిలు, గ్యారేజీ కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు సంస్థ పరిరక్షణకు యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. గతంలో 2017, 2021 పీఆర్సీ బకాయిల సాధన, బ్రెడ్ విన్నర్స్ పథకం కింద ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌లో ఎంప్లాయీస్ యూనియన్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బస్ గుర్తుకు ఓటు వేసి ఎంప్లాయీస్ యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ఈయూ డిపో కార్యదర్శి ఏల్పుల అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.పీ. సింగ్, రీజినల్ సహాయ కార్యదర్శి రఫీక్, గ్యారేజీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు




రెబ్బెన సెప్టెంబర్ 25 : కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి, వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కుష్ఠు నిర్మూలన విభాగం జాయింట్ డైరెక్టర్ డా. జాన్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం రెబ్బెన పీహెచ్‌సీ లో కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్ఠు వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. జిల్లాలోని పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆర్‌బీఎస్‌కే వైద్యులు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. కుష్ఠురహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ అబ్జర్వర్ డా. వీర కుమార్, సివిల్ సర్జన్ డా. ఎన్. రాజు, డీపీఎంఓ వెంకటేశ్వరాచారి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎం. శ్రీను, డీఎంహెచ్ఓ నాగేదర్, డా. సుజిత్, డా. రిషిక, డీపీఎం రాములు నాయక్, హెచ్‌వీ గ్లోరీ సుజనా, నోడల్ అధికారి ఆర్. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# డీఏలు, పీఆర్సీ, సీపీఎస్‌పై కీలక హామీలు

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూల స్పందన



,మంచిర్యాల సెప్టెంబర్ 25. ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కీలక హామీలు ఇవ్వడం పట్ల టీజీజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర టీజీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, జేఏసీ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దసరాకు రెండు డీఏలు, సంక్రాంతికి మరో డీఏ విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు గడియారం శ్రీహరి వెల్లడించారు. అలాగే ఈ నెలాఖరులోగా పీఆర్సీ నివేదికను తెప్పించి, మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన సీపీఎస్ రద్దుపై కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల ఇతర సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి సానుకూల నిర్ణయాలకు కృషి చేసిన రాష్ట్ర టీజీజేఏసీ నాయకత్వాన్ని గడియారం శ్రీహరి అభినందించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర టీజీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, టీఎన్జీవోస్ ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లకు మంచిర్యాల జిల్లా టీజీజేఏసీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వనజ రెడ్డి టీజీజేఏసీ సెక్రటరీ జనరల్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలకు ప్రభుత్వం హామీ ఇవ్వడంపై హర్షం వక్తపారుచారు. ఉద్యోగులు సమస్యలపై పోరాడుతున్న టీజీజేఏసీ చైర్మన్ మరియు సెక్రటరీ జనరల్ కు అభినందనలు తెలిపినారు. పొన్న మల్లయ్య మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడం ఉద్యోగులందరికీ సంతోషకరమైన విషయమన్నారు. రాష్ట్ర టీజీజేఏసీ నాయకత్వంపై ఉద్యోగులు ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా నాయకత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేసిందన్నారు. ఈ పరిణామాన్ని ఉద్యోగులందరూ ఐక్య కృషికి లభించిన సానుకూల ఫలితంగా భావించాలని పేర్కొన్నారు. భవిష్యత్‌లో టీజీజేఏసీ తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా ఉద్యోగులందరూ సమిష్టిగా, ఐక్యంగా ముందుకు సాగి తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పొన్న మల్లయ్య అధ్యక్షులు, టీఎన్జీవోస్ అటవీ శాఖ సెంట్రల్ ఫోరం మరియు కార్యదర్శి టి ఎన్ జీ ఓస్ సెంట్రల్ యూనియన్ పిలుపు నిచ్చారు.

# సింగరేణిని ఆదుకోండి.. కార్మికులను కాపాడండి!

### రూ. 55 వేల కోట్ల ప్రభుత్వ బకాయిలపై బీజేపీ సమరశంఖం

### లాభాల్లో 40% వాటా, సొంతింటి స్థలాల కోసం డిమాండ్

### సెప్టెంబర్ 30న సీసీసీ కార్నర్‌లో భారీ మహాధర్నా .

### కదం తొక్కనున్న ఈటల రాజేందర్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

మంచిర్యాల, సెప్టెంబర్ 25.. తెలంగాణ ఆర్థిక ప్రగతికి ఇంజిన్‌లా నిలిచిన సింగరేణి కాలరీస్ సంస్థ నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభం అంచున నిలిచిందని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 55,000 కోట్ల భారీ బకాయిలను తక్షణమే విడుదల చేసి సంస్థను గట్టెక్కించాలని బీజేపీ సమరశంఖం పూరించింది. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ?"భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గు వెలికితీసే నల్లసూర్యుల శ్రమ వల్లే రాష్ట్రం వెలుగులు జిమ్ముతోంది. కానీ, ప్రభుత్వ విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిన వేల కోట్ల బకాయిలు నిలిచిపోవడంతో సింగరేణి సంస్థ మనుగడే ప్రశ్నార్థకమవుతోంది. ఇది సంస్థ భవిష్యత్తుతో పాటు వేలాది కార్మిక కుటుంబాల జీవితాలతో చెలగాటమాడటమే" అని రఘునాథ్ వెరబెల్లి మండిపడ్డారు.

### సెప్టెంబర్ 30న సీసీసీ కార్నర్‌లో కార్మిక గర్జన

సింగరేణి కార్మికుల న్యాయమైన హక్కులను సాధించేందుకు, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 30న సీసీసీ కార్నర్‌లో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పోరాటానికి రాష్ట్రస్థాయి




నాయకత్వం నేరుగా రంగంలోకి దిగుతోందని తెలిపారు.

ముఖ్య అతిథులు: మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎన్. రాంచందర్ రావు హాజరై కార్మికుల తరపున గళమెత్తనున్నారు.

### బీజేపీ ముందుంచిన 6 కీలక డిమాండ్లు:

ప్రభుత్వం నుంచి సంస్థకు రావాల్సిన పూర్తి బకాయిలను ఏకమొత్తంలో విడుదల చేసి సింగరేణి ఆర్థిక పరిస్థితిని స్థిరీకరించాలి.

2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను ఆలస్యం చేయకుండా ప్రకటించి, కార్మికులకు 40% వాటాను దసరా-దీపావళి బోనస్‌గా చెల్లించాలి. ప్రతి కార్మికుడి కుటుంబానికి రెండు గుంటల నివేశన స్థలం కేటాయించి, సొంతింటి నిర్మాణానికి సులభతరమైన బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలి. కార్మికుల వైద్య అన్‌ఫిట్ (మెడికల్ ఇన్వాలిడేషన్) ప్రక్రియలో దళారీ వ్యవస్థను అరికట్టి, నెలకు మూడు పారదర్శక బోర్డులు నిర్వహించి అర్హులకు తక్షణ న్యాయం చేయాలి. భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికులకు నాణ్యమైన హెల్మెట్లు, సేఫ్టీ షూస్, అధునాతన రక్షణ పనిముట్లను సకాలంలో అందించాలి. గతంలో ఉద్యోగాల నుంచి తొలగించబడిన కార్మికుల కేసులను మానవతా దృక్పథంతో నిబంధనల ప్రకారం పునఃసమీక్షించి విధుల్లోకి తీసుకునే అవకాశం కల్పించాలి. ?"కార్మికుల శ్రమకు గౌరవం -- హక్కులకు రక్షణ -- కుటుంబాలకు భద్రత అనే నినాదంతో బీజేపీ నిరంతరం పోరాడుతుంది. సింగరేణి బలపడితేనే కార్మిక కుటుంబాలు బాగుపడతాయి."

### రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు

ఈ సమావేశంలో బీజేపీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కమలాకర్ రావు, సీనియర్ నాయకులు బెర సత్యనారాయణ, నస్పూర్ పట్టణ అధ్యక్షులు కుర్ర చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, శ్రీరాంపూర్ ప్రధాన కార్యదర్శులు పొన్నవేని సదయ్య, రమణవేని శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జిట్టవేణి రేణుక, నాయకురాళ్లు బొంగోని శిరీష, సృజన, కార్మిక సెల్ జిల్లా అధ్యక్షులు గొల్ల మహేందర్, సీనియర్ నాయకులు బొజ్జ నరసయ్య, అటుకుపురం సమ్మయ్య, బొద్దున రమేష్, బీఎంఎస్ ఏరియా సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తిర్యాణి మండల సమగ్ర అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగాలి

### మండల సర్వసభ్య సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్..

తిర్యాణి, సెప్టెంబర్ 25.. తిర్యాణి: మండల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామపంచాయతీలు, రైతులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ అన్నారు. తిర్యాణి మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మండలంలోని ప్రజలు, రైతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

### ఐబీ ప్రధాన రహదారిపై ప్రత్యేక దృష్టి

మండల అభివృద్ధిలో కీలకమైన తిర్యాణి--తాండూర్ ఐబీ ప్రధాన రహదారి అభివృద్ధి, మరమ్మతులు, రహదారి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను కోరారు. ఈ రహదారి మెరుగుపడితే మండలంలోని అనేక గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, రైతులు తమ పంటలను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

### గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ అవసరం

మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ కాలువలను శాస్త్రీయంగా ఏర్పాటు చేసి, గ్రామాల్లో పారిశుద్ధ్యం, ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.




### ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని చుంచు శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. పాఠశాల భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర అవసరాలను గుర్తించి అభివృద్ధి చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా పాఠశాలల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

### రైతులకు విత్తనాలు,ఎరువులు సకాలంలో అందించాలి

తిర్యాణి మండలం ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతం కావడంతో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా, డీఏపీ వంటి ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పంటల మార్కెటింగ్, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు రైతులకు సకాలంలో అందేలా చూడాలని సూచించారు.

### అడవి పందుల బెడదకు పరిష్కారం చూపాలి

మండలంలోని పలు గ్రామాల్లో అడవి పందుల బెడదతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అడవి పందులు పంటలను నాశనం చేయడం వల్ల రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లుతోందని తెలిపారు. ఈ సమస్యపై అటవీ శాఖ అధికారులు, సంబంధిత ఇతర శాఖలు సమన్వయంతో పనిచేసి పరిష్కార మార్గాలను అన్వేషించాలని కోరారు.

### సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

తిర్యాణి మండల అభివృద్ధి ఒక్క శాఖతో సాధ్యం కాదని చుంచు శ్రీనివాస్ అన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, గ్రామపంచాయతీలు, రైతులు, ప్రజలు సమన్వయంతో పనిచేసినప్పుడే మండలంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరుతాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వృత్తి విద్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన సెప్టెంబర్ 25 : సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ అందించేందుకు అనుభవం, నైపుణ్యం ఉన్న శిక్షకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, మగ్గం, ఫాబ్రిక్ పెయింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కనీసం పదో తరగతి విద్యార్హతతో పాటు సంబంధిత వృత్తిలో శిక్షణ, నైపుణ్యం, అనుభవం ఉన్న వారు శిక్షకులుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబర్ 1వ తేదీలోపు గోలేటిలోని జీఎం కార్యాలయ పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో అందజేయాలని సూచించారు. అదేవిధంగా స్వయం ఉపాధి కోసం టైలరింగ్, మగ్గం, ఫాబ్రిక్ పెయింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు ఆసక్తి ఉన్న మహిళలు కూడా అక్టోబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9951214116 నంబర్‌ను సంప్రదించాలని జీఎం తెలిపారు.

# మండల సమస్యలపై అధికారులదే బాధ్యత

### సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

### రోడ్లు, విద్యుత్ స్తంభాలు, అంగన్‌వాడీలపై మండల సమీక్షలో వాడీవేడీ చర్చ



తిర్యాని, సెప్టెంబర్ 25 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సమీక్ష సమావేశం స్పెషల్ ఆఫీసర్ జాదవ్ అంబాజీ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల పరిధిలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా గ్రామీణ రోడ్ల పరిస్థితి, విద్యుత్ స్తంభాల సమస్యలు సమావేశంలో చర్చకు వచ్చాయి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆయా సమస్యలను గుర్తించి సంబంధిత మండల అధికారులు సకాలంలో పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పర్యవేక్షణపై సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ల పర్యవేక్షణ సక్రమంగా లేదని, కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్యుత్ సౌకర్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చుంచు శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అనిల్‌కుమార్, ఎంపీడీవో బి. నాగేష్, తహసీల్దార్ శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ పల్లవి, మండల పంచాయతీ అధికారి పి. ప్రశాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రతి 45 రోజులకు ఒకసారి మండల సమీక్ష సమావేశం నిర్వహించి, శాఖల వారీగా సమస్యల పరిష్కారంపై పురోగతిని సమీక్షించాలని నిర్ణయించారు.

# కేసరి అంజనేయులు గౌడ్‌కు ట్రైన్ ది ట్రైనర్ సర్టిఫికెట్




రెబ్బెన సెప్టెంబర్ 25 : ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైన్ ది ట్రైనర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన కేసరి అంజనేయులు గౌడ్కు శిక్షణ పూర్తి చేసిన ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. నిర్మల్‌లో నిర్వహించిన మెగా ఇంపాక్ట్ కార్యక్రమంలో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ డా. గంపా నాగేశ్వరరావు, రీజియన్-19 అధ్యక్షులు వాడేకర్ లక్ష్మణ్ సమక్షంలో సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ శిక్షణ ద్వారా యువత, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలకు శిక్షణ, సంభాషణా నైపుణ్యాలు, ప్రేరణ, నాయకత్వ వికాసంపై మార్గదర్శకత్వం అందించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నట్లు అంజనేయులు గౌడ్ తెలిపారు. విద్యార్థులు, యువతలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, లక్ష్యసాధన, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడమే తన లక్ష్యమన్నారు. "ఇంటికొక వక్త.. ఊరికొక శిక్షకుడు" లక్ష్యంతో సమాజంలో సానుకూల మార్పు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# జిల్లా ఖజానా అధికారిగా హమీద్దా ఖాన్ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరణ



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 25: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఖజానా శాఖ అధికారిగా హమీద్దా ఖాన్ ఇన్‌చార్జిగా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి జిల్లా మంథని డివిజన్ ఖజానా కార్యాలయంలో సహాయ ఖజానా అధికారిగా పనిచేస్తున్న హమీద్దా ఖాన్‌ను డిప్యూటేషన్‌పై జిల్లా ఖజానా అధికారిగా రాష్ట్ర ట్రెజరీ శాఖ సంచాలకులు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ కె.హరిత నేతృత్వంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బిల్లుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా హమీద్దా ఖాన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# నిమజ్జనం ఘాట్ ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 25: నిమజ్జనోత్సవాల సందర్భంగా శుక్రవారం అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సబ్ కలెక్టర్‌తో కలిసి స్థానిక విగ్రహాల నిమజ్జనం ఘాట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీలో భక్తుల రక్షణ, పరిశుభ్రత, విద్యుత్ దీపాలు, బారికేడ్ల ఏర్పాటు, ట్రాఫిక్ నివారణ చర్యలను అధికారులు సమీక్షించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు నిమజ్జనం పాయింట్ వద్ద ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు. నిమజ్జన ఘాట్ల వద్ద, ప్రధాన మార్గాల్లో అంతరాయం లేని హై-మాస్ట్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మునిసిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని, భక్తులకు తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని ఆదేశించారు. రద్దీ నివారణకు బారికేడింగ్, వాహనాల పార్కింగ్ స్థలాలను స్పష్టంగా కేటాయించాలని పోలీసు, రెవెన్యూ శాఖలను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్, ఆరోగ్య శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు అన్ని ఏర్పాట్లను శరవేగంగా పూర్తి చేస్తున్నామని, నిమర్జనం ముగిసే వరకు ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటాయని సబ్ కలెక్టర్ తెలిపారు.

# వానాకాలం ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశం



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 25: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 2026-27 వానాకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలు కోసం కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ పవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి వ్యవసాయ విస్తరణ అధికారులు, సహకార శాఖ, ఐకేపీ సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వానాకాలం సీజన్‌లో 23,900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, అక్టోబర్ 1న జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాలను ఎత్తైన చదును ప్రదేశాల్లో, రహదారికి దగ్గరగా, వాహనాలు వెళ్లేలా గుర్తించి, మౌలిక వసతులు, తాగునీరు, నీడ, వెలుతురు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సరిపడా గోనె సంచులు, ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు, డ్రయర్లు, ప్రతి కేంద్రంలో 2 ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు ఏర్పాటు చేయాలని, సరిపడా హమాలీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. 17 శాతం లోపు తేమ, తాలు దుమ్ము లేకుండా రైతులు ధాన్యాన్ని తీసుకురావాలని అవగాహన కల్పించాలని, క్రమపద్ధతిలో కొనుగోలు చేపట్టాలని ఆదేశించారు. తూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు తరలించాలని, నిల్వకు అవసరమైన గోదాములు సిద్ధం చేయాలని ఆదేశించారు. మద్దతు ధర, సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ తదితర వివరాలు రైతులకు తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా పౌర సరఫరాల అధికారి వాజీద్, జిల్లా సహకార అధికారి, ఐకేపీ ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

